క్లుప్తంగా

డిప్యూటీ ఆర్‌ఎంకు సన్మానం



స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ మహబూబ్‌నగర్ రీజియన్ డిప్యూటీ మేనేజర్‌గా కవిత శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమెను ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ ఫోరం ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఫోరం అధ్యక్షుడు రాజసింహుడు మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో భగవంతు, నాగాంజనేయులు, లలితమ్మ, హేమంత్‌కుమార్, రియాజుద్దీన్, బుచ్చన్న, ఉదయ్‌కుమార్, కేకే మూర్తి, ఇజ్రాయెల్, ప్రకాశ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక బాలాజీనగర్ (డివిజన్ నం.11)లోని అభయాంజనేయస్వామి ఆలయం నుంచి మెయిన్ రోడ్డు వరకు, షాషాబ్‌గుట్ట చౌరస్తా (డివిజన్ నం .41) నుంచి నలంద ఆటో స్టాండ్ వరకు చేపట్టిన సీసీరోడ్డు పనులను శుక్రవారం మున్సిపల్ మాజీ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్ గౌడ్, మాజీ వైస్‌చైర్మన్ షబ్బీర్ అహ్మద్ పరిశీలించారు. వారి వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు శాంతన్న యాదవ్, నర్సింహులు, అంజాద్, రాకేష్, బాలాజీనగర్ వాసులు సనాతన బాలరాజు, కురుమూర్తిగౌడ్, పాతూరు రమేష్, సుధీర్‌గౌడ్, సందీప్, అశోక్‌బాబు, రాఘవరెడ్డి తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ అందజేత



దేవరకద్ర: కౌకుంట్ల మండలం రేకులంపల్లికి చెందిన రాములు అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడి వైద్యఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ. 2.50లక్షల ఎల్‌ఓసీని శుక్రవారం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తన నివాసంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆపత్కాలంలో నిరుపేదలను ఆదుకునేందుకు సీఎం సహాయనిధి ఎంతో దోహద పడుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఎవరికి ఏ ఆపద వచ్చినా ఆదుకోడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

కొనసాగుతున్న ఏపీఎల్ క్రికెట్ టోర్నీ



మహబూబ్‌నగర్ క్రీడలు: అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి పాలమూరు ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న అయ్యప్ప ప్రీమియర్ లీగ్ ఉత్సాహంగా కొనసాగుతోంది. మూడో రోజు శుక్రవారం మ్యాచ్‌లను అయ్యప్ప దీక్ష ప్రచార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రాజ్‌దేశ్ పాండే గురుస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో సోదర భావం పెంపొందుతుందన్నారు. క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్న నిర్వాహకులను ఆయన అభినందించారు. అనంతరం రాజ్‌దేశ్ పాండేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దీక్ష ప్రచార సమితి జిల్లా అధ్యక్షుడు సీమ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల కార్యదర్శిపై చర్య తీసుకోవాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పేద విద్యార్థులపై అహంకార పూరిత వ్యాఖ్యలు చేసిన తెలంగాణ గురుకుల విద్యాలయ సంస్థ కార్యదర్శి అలుగు వర్షిణిపై చర్యలు తీసుకోవాలని స్వేరోస్ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ పవన్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎంవీఎస్ డిగ్రీ కళాశాల ఎస్సీ బాలుర హాస్టల్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గురుకులాల్లో బాలబాలికలతో పనులు చేయించాలని.. అవసరమైతే మరుగుదొడ్లు సైతం కడిగించాలని వ్యాఖ్యలు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఆమెను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

గణనీయంగా వానాకాలం సాగు



నవాబుపేట శివారులో జొన్న విత్తనాలు విత్తుతున్న వ్యవసాయ కూలీలు

- 30వేల ఎకరాల్లో పంటసాగు అంచనా
- మూడింతలు పెరగనున్న పత్తిసాగు విస్తీర్ణం
- వ్యవసాయ పనుల్లో రైతుల నిమగ్నం

నవాబుపేట: మండలంలో ఈ ఏడాది వానాకాలం సాగు గణనీయంగా పెరగనుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా సాగు విస్తీర్ణం 30వేల ఎకరాలు దాటుతుందని వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. మండలవ్యాప్తంగా కేవలం 20వేల ఎకరాల వరకు సాగు చేసే రైతులు.. తాజాగా ప్రధాన పంటలపై మక్కువ చూపుతుండటంతో సాగు విస్తీర్ణం భారీగా పెరిగింది. గతంలో పత్తిపంట కేవలం 300 నుంచి 400 ఎకరాల్లో సాగయ్యేది. ఈ ఏడాది వెయ్యి ఎకరాల్లో పత్తిపంట సాగయ్యే అవకాశం ఉంది. వరిపంట సైతం 4వేల నుంచి 5వేల ఎకరాల్లో అధికంగా సాగు అవుతుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. మొక్కజొన్న సాగు కూడా ప్రతి ఏటా పెరుగుతూ వస్తోంది. ఈసారి 12వేల నుంచి 13వేల ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉంది.

వానాకాలం సాగు ఇలా.. (ఎకరాల్లో)

పంట	గతేడాది	ఈసారి అంచనా
వరి	12,785	16,000-18,000
పత్తి	364	1,500
మొక్కజొన్న	10,000	12,000- 3,000
కంది	200	1,000
ఇతర పంటలు	300	400

అన్నదాతల బిజీబిజీ

ముందుగానే నైరుతి రుతుపవనాల రాకతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఇప్పటికే దుక్కులు దున్ని సిద్ధం చేసుకున్న పొలాల్లో విత్తనాలు విత్తుతున్నారు. మరికొందరు భూముల్లో దుక్కులు దున్నిస్తూ.. అవసరమైన ఎరువులు, విత్తనాలను సమకూర్చుకుంటున్నారు. ఎక్కువ శాతం రైతులు రోహిణి కార్తెలో జొన్న, పత్తి విత్తనాలు విత్తేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ ఏడాది వానాకాలంలో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతుందని వ్యవసాయశాఖ అంచనా వేస్తున్న నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉండేలా చూస్తున్నారు. ఇప్పటికే భూ సారం పెంచే జీలుగ, పచ్చిరొట్ట విత్తనాలను సబ్సిడీపై అందిస్తున్నారు.

రైతులకు సూచనలు చేయాలి..



రైతులు చాలా మంది మొక్కుబడిగా ఒకే పంటను సాగుచేస్తూ వస్తున్నారు. ఏటా పంట పెట్టుబడి పెరుగుతున్నా దిగుబడి మాత్రం పెరగడం లేదు. గ్రామస్థాయిలో రైతుల పొలాలను బట్టి పంటలు వేసుకునేలా అవగాహన కల్పించాలి. అధునాతన పద్ధతుల ప్రకారం సాగు చేసుకునేలా సూచించాలి. భూసార పరీక్షలు చేసి.. వాటికి అనుగుణంగా సాగు చేసేలా అవగాహన కల్పించాలి.

– పాండు, రైతు, హజిలాపూర్

అందుబాటులో విత్తనాలు..



ఈసారి వానాకాలంలో సాగు విస్తీర్ణం పెరగనుంది. ఇందుకు అనుగుణంగా రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. పంటల సాగులో రైతులు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించాలి. రసాయనిక ఎరువులను అవసరం మేరకే వినియోగించాలి. సేంద్రియ ఎరువుల వినియోగంపై దృష్టి సారించాలి.

– కృష్ణకిశోర్, ఏఓ, నవాబుపేట

శుభ్రత అందరి బాధ్యత



మిడ్జిల్: పరిసరాల శుభ్రత పాటించాల్సిన బాధ్యత అందరిపై ఉందని మండల వైద్యాధికారి శివకాంత్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో డ్రై డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి దోమలు వృద్ధి చెందకుండా చేపట్టాల్సిన చర్యలను వివరించారు. అదే విధంగా ఎక్కువ రోజులపాటు నిల్వ ఉన్న నీటిని పారబోశారు. వర్షాకాలంలో మలేరియా, డెంగీ తదితర సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున.. ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది దేవయ్య, జంగయ్య, సంపత్, గీత పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



గండీడ్: అర్హులైన ప్రతి పేదకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కొండాపూర్‌లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులందరికీ విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. పేదలు ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకొని సొంతింటి కలను సాకారం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుష్మిత, మాజీ సర్పంచ్ సునీల్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తిరుపతయ్య, చెంచు పద్మమ్మ, సత్యమ్మ, చెన్నయ్య, గోపాల్, కిష్టయ్య, దస్తయ్య, చెన్నయ్య, లాలయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

జడ్చర్ల టౌన్: సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం పట్టణంలో మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్, సీఐటీయూ సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ పాత భవనం వద్ద యూనియన్ నాయకురాలు యాదమ్మ, నూతన భవనం వద్ద జంగమ్మ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆకుల వెంకటేష్, సీఐటీయూ జిల్లా నాయకుడు తెలుగు సత్తయ్య మాట్లాడుతూ.. 1970లో కార్మికులు, రైతులు, ప్రజల కోసం ప్రజాస్వామ్య ట్రేడ్ యూనియన్ స్థాపించాలనే ఉద్దేశంతో బీటీ రణదీవే, రామ్మూర్తి సీఐటీయూను స్థాపించారన్నారు. వారి ఆశయాల సాధన కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్మిక చట్టాల అమలు కోసం ప్రభుత్వంతో సీఐటీయూ పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేశ్, కృష్ణ, అంజమ్మ, శ్యామల, శంకర్, కేశవులు, విద్యాసాగర్, పాండు, బాల్ వెంకట్, లక్ష్మమ్మ, వెంకటమ్మ, అలివేలు, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.



రేణుకా ఎల్లమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యేలు



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయాన్ని శుక్రవారం ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరి సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు ఎమ్మెల్యేలకు వేద ఆశీర్వాదం అందించి.. తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎస్పీ వెంకటేశ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మారేపల్లి సురేందర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు గుర్తింపు కార్డు తప్పనిసరి



భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తున్న ప్రవీణ్‌కుమార్

హన్వాడ: కార్మికులందరికీ గుర్తింపు కార్డు తప్పనిసరిగా ఉండాలని ఆశ్రయ ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో 30 మంది భవన నిర్మాణ కార్మికులకు లేబర్ కార్డులు, మరో 35 మందికి ఈ–శ్రామ్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో కార్మికులకు గుర్తింపు కార్డులు మంజూరు చేస్తుందన్నారు. ప్రభుత్వ గుర్తింపు కార్మికులకు భరోసాగా ఉంటుందన్నారు. లేబర్ కార్డు కలిగిన భవన నిర్మాణ కార్మికుడు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 6.50లక్షల బీమా, ఈ–శ్రామ్ కార్డు కలిగిన వారికి రూ. 2లక్షల బీమా వర్తిస్తుందన్నారు. పంచాయతీ కార్యదర్శి దీప్తి, ఆశ్రయ ఫౌండేషన్ సిబ్బంది మంజుల, అంజాద్, ఏఈఓ నాగప్ప పాల్గొన్నారు.

చెరువులు, కుంటలను కాపాడాలని వినతి



మంత్రి దామోదర రాజనర్సింహకు వినతిపత్రం అందిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలోని చెరువులు, కుంటలను కాపాడాలని ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు మెట్టుకాడి ప్రభాకర్ కోరారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలో రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక ఏనుగొండ, మౌలాలిగుట్ట, మోదంకుంటలను కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ హయాంలో కబ్జాలు చేసిన వాళ్లే మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా కుంటలను కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తూ.. మత్స్యకారుల పొట్ట కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువులు, కుంటల కబ్జాపై ఇరిగేషన్ రెవెన్యూశాఖల అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. కబ్జాలను అరికట్టని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు చంద్రుడు, బోల యాదయ్య, గోనెల రాములు, శ్రీనివాసులు, గంగపురి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య



జడ్చర్ల హైస్కూల్‌లో తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ మంజులాదేవి



దేవరకద్ర మండలం ఇస్రంపల్లిలో..

దేవరకద్ర/జడ్చర్ల టౌన్/చిన్నచింతకుంట/భూత్పూర్/అడ్డాకుల/మిడ్జిల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య లభిస్తుందని ఎంఈఓ మంజులత అన్నారు. శుక్రవారం కౌకుంట్ల మండలం ఇస్రంపల్లిలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఎంఈఓ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ బడుల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారని.. విద్యార్థులకు ఉచితంగా యూనిఫాం దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలతో పాటు మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాలయ్య, మహిళా సంఘం అధ్యక్షురాలు జ్యోతమ్మ పాల్గొన్నారు.

- ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అందరూ సహకరించాలని ఎంఈఓ మంజులాదేవి కోరారు. జడ్చర్ల జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అదే విధంగా టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార జాత జడ్చర్ల మండలంలో కొనసాగింది. కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, కౌన్సిలర్ కుమ్మరి రాజు, టీఎస్ యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.
- చిన్నచింతకుంట మండల కేంద్రంతో పాటు అడ్డాకుల మండలంలోని పొన్నకల్, కందూర్, రాచాల, అడ్డాకుల గ్రామాల్లో టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటేశ్ పాల్గొన్నారు.
- భూత్పూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో బడిబాట కార్యక్రమం ముమ్మరంగా కొనసాగింది.
- మూసాపేటలో ఎంఈఓ రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులు, తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని కోరారు. నిజాలాపూర్‌లో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం బాలకిష్టయ్య ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు.
- మిడ్జిల్ మండలంలోని బోయిన్‌పల్లిలో ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహించారు.

కూచూర్‌లో ఆధ్యాత్మిక సంబురం



కూచూర్‌లో ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు



లింగంపేటలో ఉత్సవాలకు హాజరైన భక్తులు

నవాబుపేట: మండలంలోని కూచూర్‌లో నూతనంగా నిర్మించిన దేవాలయంలో శుక్రవారం దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన కనులపండువగా జరిగింది. ఈ సందర్భంగా మూడు రోజులపాటు నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. వేద ఘోషతో గ్రామం మార్మోగింది. ప్రత్యేక పూజల అనంతరం ఆలయంలో ఆంజనేయస్వామి విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా బొడ్రాయి (గ్రామదేవత)ను ప్రతిష్ఠించి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల్లో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గ్రామస్తులు సమష్టిగా ఇలాంటి ఉత్సవాలు నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మికత అవసరమన్నారు. అదే విధంగా జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సోదరుడు దుశ్యంత్‌రెడ్డి దేవతా విగ్రహాలను దర్శించుకొని.. ఆలయ అభివృద్ధి కోసం రూ.లక్ష విరాళం అందించారు. కార్యక్రమాల్లో జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ యాదయ్య, బీఆర్‌ఎస్ యువనేత అభిమన్యురెడ్డి, మాజీ జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లక్ష్మయ్య, చెన్నయ్య, ప్రతాప్, నాగిరెడ్డి, రవి, బోజయ్య, గోపాల్‌గౌడ్, యాదయ్య, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, చెన్నప్ప పాల్గొన్నారు.

వైభవంగా దేవతా విగ్రహాల పునఃప్రతిష్ఠాపన

జడ్చర్ల టౌన్: మండలంలోని లింగంపేట శివమారుతి ఆలయంలో మహా గణపతి, శివలింగం, నంది, నవగ్రహాలు, నాగదేవత, సీతారామలక్ష్మణ, ధ్వజస్తంభం, ఆంజనేయస్వామి విగ్రహాల పునఃప్రతిష్ఠా మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య మూడు రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహించి.. దేవతా విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం యంత్ర స్థాపన, విగ్రహస్థాపన, ప్రాణప్రతిష్ఠ, హోమం, జయాది వృద్ధి హోమాలు పూర్ణాహుతి, కలశ ఉద్వాసన, బలిహరణం, మహా మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

పంటల మార్పిడితో అధిక దిగుబడులు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు

మహబూబ్‌నగర్ రూరల్: రైతులు నేల స్వభావం మేరకు పంటలు సాగుచేసి దిగుబడులు పెంచుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ కె.సదయ్య, డాక్టర్ వి.దివ్యరాణి అన్నారు. 'రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ప్రొ.జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయశాఖ సంయుక్త ఆధ్వర్యంలో మాచన్‌పల్లి రైతువేదికలో పంటల సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. ఆధునిక పద్ధతుల్లో పంటసాగు లాభదాయకమన్నారు. ముఖ్యంగా యూరియా వాడకంలో మెళకువలు పాటించాలని సూచించారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులు వినియోగించాలని.. ఏటా పంట మార్పిడి విధానంతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. అదే విధంగా నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంచుకోవాలని అన్నారు. ఉద్యాన పంటల సాగుకు సంబంధించి సబ్సిడీ పరికరాలు, మల్చింగ్, పందిరి, డ్రిప్ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు పి.శ్రీనివాసులు, లీడ్ బ్యాంకు మేనేజర్ కల్వ భాస్కర్, ఏఓ శృతి, ఉద్యానశాఖ అధికారిణి స్వప్న, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ జీషాన్ అలీ, సెరికల్చర్ ఆఫీసర్ జనార్దన్, టీజీఎస్‌డీసీ డీఎం ఆది నారాయణరెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి ఆరాధనోత్సవాలు

జడ్చర్ల టౌన్: మండలంలోని గంగాపురం వద్ద ఉన్న మలయాళస్వామి లక్ష్మీనారాయణ ఆశ్రమం వ్యవస్థాపకుడు నిత్యశుద్ధానంద 4వ ఆరాధనోత్సవాలు శని, ఆదివారాల్లో నిర్వహించనున్నట్లు ఆశ్రమ పీఠాధిపతి పరమాత్మానంద గిరి స్వామి తెలిపారు. ఆరాధనోత్సవాల్లో భాగంగా మొదటిరోజు రుద్రాభిషేకం, హనుమాన్ చాలీసా పారాయణం, దీపాలంకరణ, పల్లకీ సేవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రెండో రోజు రుద్రాభిషేకం, శ్రీవిష్ణు సహస్రనామ యజ్ఞం, కుంకుమార్చన, సాధువుల ప్రవచనాలు, నిత్యశుద్ధానందమూర్తి పూజ, అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

మల్లు రవిని కలిసిన మండల నాయకులు

నవాబుపేట: పీసీసీ క్రమశిక్షణ సంఘం చైర్మన్‌గా నియమితులైన నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవిని శుక్రవారం హైదరాబాద్‌లో మండల నాయకులు కలిసి శాలువాతో సత్కరించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేశిరెడ్డి రవీందర్‌రెడ్డి, పీసీసీ స్పోక్‌పర్సన్ ధార భాస్కర్ తదితరులు ఎంపీని సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

చికెన్ వేస్టేజీ తరలింపునకు టెండరు ఖరారు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఎట్టకేలకు నగరంలో చికెన్ వేస్టేజీ తరలింపునకు టెండరు ఖరారైంది. శుక్రవారం సాయంత్రం మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన బహిరంగ వేలం పాటలో నలుగురు టెండరుదారులు పాల్గొన్నారు. అత్యధికంగా పరుశురాములు రూ.65.70 లక్షలకు ఈ టెండరు దక్కించుకున్నారు. జూన్ 1 నుంచి 2026 మార్చి 31 వరకు పది నెలల పాటు అమలులో ఉంటుంది. నిబంధనల ప్రకారం నగరంలోని సుమారు 225 దుకాణదారుల నుంచి సేకరించిన చికెన్ వేస్టేజీని ఇతర ప్రాంతాలకు తరలించాల్సి ఉంటుంది. కాగా, గత ఏడాది రూ.15.50 లక్షలకు ఈ టెండరును ఓ వ్యక్తి దక్కించుకున్నా వివిధ కారణాలతో రూ.ఎనిమిది లక్షలు మాత్రమే మున్సిపాలిటీకి చెల్లించి మధ్యలోనే వదిలేశారు. ఆ తర్వాత దీని నిర్వహణకు ఎవరూ ముందుకు రాలేకపోయారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గత నెల మొదటి వారంలో టెండర్ గురించి పది యూనియన్ నాయకులతో మున్సిపల్ అధికారులు పలుమార్లు చర్చలు జరిపినా ఓ కొలిక్కిరాలేకపోయింది. దీంతో రెండు నెలల పాటు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులే ఎప్పటికప్పుడు వాహనాలతో చికెన్ వేస్టేజీని కోయిల్‌కొండ ఎక్స్‌రోడ్డులోని డంపింగ్ యార్డుకు తరలించి పూడ్చి వేయసాగారు. ఈ క్రమంలోనే తాజాగా వేలం నిర్వహించడం గమనార్హం. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు గురులింగం, వజ్రకుమార్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

'మందకృష్ణకు ఘనస్వాగతం పలుకుదాం'



జడ్చర్ల టౌన్: మూడు దశాబ్దాల పాటు అలుపెరగని ఉద్యమం సాగించి ఎస్సీ వర్గీకరణ సాధించడంతో పాటు రాష్ట్రపతి చేతులమీదుగా పద్మశ్రీ అవార్డు స్వీకరించి శనివారం వరంగల్‌కు వస్తున్న మందకృష్ణ మాదిగకు ఘన స్వాగతం పలుకుదామని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి జంగయ్య మాదిగ పిలుపునిచ్చారు. శుక్రవారం జడ్చర్లలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో వరంగల్‌కు తరలివచ్చి.. సాయంత్రం 4గంటలకు వరంగల్ రైల్వేస్టేషన్ నుంచి ప్రారంభమయ్యే ర్యాలీలో పాల్గొనాలని కోరారు. ర్యాలీ అనంతరం కాళోజీ కళాక్షేత్రంలో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల జాతీయ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు వినోద్‌కుమార్, కందూరి యాదయ్య, జంగయ్య, కేశవులు, నర్సింహ, నర్సింహులు ఉన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ



దేవరకద్ర: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలతో పాటు కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినులకు అవసరమైన పాఠ్యపుస్తకాలను శుక్రవారం ఎంఈఓ బలరాం పంపిణీ చేశారు. బడుల ప్రారంభం రోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించేందుకు గాను అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు సరఫరా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌గౌడ్, రాధిక, శారద, అనురాధ, శేఖర్ పాల్గొన్నారు.

రేపు విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక బోయపల్లి రోడ్డులోని తువ్వగుట్టపై ఉన్న బసవ భవన్‌లో జూన్ 1న ఉత్తమ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు వీరశైవ లింగాయత్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శి జి.రవీందర్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉస్మానియా జనరల్ హాస్పిటల్ ప్రొఫెసర్ డా.కెంచె జీవన్, వక్త బి.రాజేశ్వర్ హాజరవుతారన్నారు.